క్లుప్తంగా

గ్రంథాలయం ఆకస్మిక తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న ఆదిలక్ష్మి

కురిచేడు: స్థానిక గ్రంథాలయాన్ని జిల్లా గ్రంథాలయ శాఖ కార్యదర్శి కాసు ఆదిలక్ష్మి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. సభ్యత్వాలు పెంచాలని, సెస్‌లు వసూలు చేయాలని ఆమె సూచించారు. గ్రంథ పాలకురాలు సుమతి పాల్గొన్నారు.

తాళ్లూరు: మండలంలో ప్రస్తుతం ఉన్న గ్రంథాలయం అద్దె భవనంలో కొనసాగుతోందని, సొంత గ్రంథాలయం నిర్మాణానికి నిధులు కొరత ఉందని, దాతలు ముందుకొచ్చి సహకరించాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కాసు ఆదిలక్ష్మి అన్నారు. స్థానిక గ్రంథాలయాన్ని ఆమె మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి మెంబర్షిప్‌లు పెంచాలన్నారు. సెస్ వసూల్ చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు.

బోధనంపాడు విద్యార్థికి నవోదయలో సీటు



సాయిప్రసన్న

కురిచేడు: ఇటీవల జరిగిన నవోదయ ఎంట్రన్స్ ఫలితాల్లో మండలంలోని బోధనంపాడు గ్రామానికి చెందిన ముత్తుకూరి వెంకట సాయిప్రసన్నకు సీటు లభించింది. విద్యార్థిని అర్హత పరీక్షకు శిక్షణ ఇచ్చి సిద్ధం చేసిన చెన్నెబోయిన వెంకటేశ్వర్లుకు బాలుడి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. ఇటీవల జిల్లాలో జరిగిన సైన్స్‌ఫెయిర్‌కు 150 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. వారిలో బోధనంపాడు పాఠశాలకు చెందిన ముత్తుకూరి సాయిప్రసన్నతో పాటు వేమూ వెంకట నాగేంద్ర ఉన్నారు. వీరు శ్రీహరికోట, బెంగళూరు మోక్షగుండం విశ్వేశ్వరయ్య మ్యూజియం, బ్లెయిన్ గ్రూప్ ప్లాంటోరియం టూర్‌కు ఎంపికయ్యారు.

విద్యార్థులు అత్యున్నత స్థాయికి ఎదగాలి



మాట్లాడుతున్న గూడూరి ఎరిక్షన్‌బాబు

పెద్దదోర్నాల: విద్యార్థులు అత్యున్నత స్థాయికి ఎదిగి తల్లిదండ్రులకు పేరు తేవాలని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక డిగ్రీ కళాశాలలో నిర్వహించిన ఫేర్‌వెల్ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మెరిట్ సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ప్రిన్సిపాల్ సావిత్రి, అధ్యాపకులు పాల్గొన్నారు.

సారా నివారణపై అవగాహన



మాట్లాడుతున్న అసిస్టెంట్ కమిషనర్ విజయ

పెద్దదోర్నాల: సారా నివారణపై ఎక్సైజ్ అధికారులు మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మండల కేంద్రంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఎక్సైజ్ సర్కిల్ ఎస్సై వెంకటరెడ్డి ఆధ్వర్యంలో అసిస్టెంట్ కమిషనర్ విజయ, ఏఈఎస్‌లు కె.బాలయ్య, జనార్దన్‌లు పాల్గొని నాటుసారాతో కలిగే అనర్థాలు వివరించారు. దీంతో పాటు స్థానిక వ్యాపారులను సారా తయారీకి వినియోగించే బెల్లాన్ని పరిమితులకు మించి విక్రయించటం నేరమని తెలిపారు. ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య సేవలకు సెలవు

గిద్దలూరు రూరల్: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల సమీపంలోని కోట గడ్డ వీధి ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో వైద్యుడి కొరతతో వైద్యే సేవలకు సెలవు ప్రకటించారు. ఇక్కడ పనిచేస్తున్న డా.షరీఫ్ నెల రోజుల క్రితం పీజీ చదువు కోసం తమిళనాడుకు వెళ్లాడు. అప్పటి నుంచి నంద్యాల రోడ్డులోని జగనన్న కాలనీలో ఉన్న ప్రైమరీ హెల్త్ సెంటర్ వైద్యుడు భార్గవ్‌రెడ్డిని ఇన్‌చార్జ్‌గా నియమించారు. ఒకే వైద్యుడు రెండు చోట్ల వైద్యం అందించలేకపోవడంతో రోగులకు సరైన వైద్యం అందుబాటులో లేదు. వైద్యశాలలో పరికరాలు, మందులు ఉన్నా వైద్య సిబ్బంది కొరత ఏర్పడటంతో వైద్యశాలకు వచ్చే రోగుల సంఖ్య రోజు రోజుకూ తగ్గిపోయింది.

11 మద్యం బాటిళ్ల స్వాధీనం

మార్కాపురం టౌన్: పట్టణంలోని తర్లుపాడు రోడ్డులో ఒక హోటల్లో మద్యం అమ్ముతున్న వ్యక్తిని అరెస్టు చేసి 11 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు పట్టణ ఎస్సై సైదుబాబు తెలిపారు. మద్యం అక్రమంగా అమ్మినా, బెల్టు షాపులు ఏర్పాటు చేసినా కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు.



సుంకేసుల గ్రామానికి వెళ్లే కొండపై రహదారిలో లేచిన కంకర



పుచ్చకాయలపల్లి డంపింగ్ యార్డు వద్ద ఛిద్రమైన తారు రోడ్డు

అధ్వానంగా రహదారులు

పెద్దారవీడు:

మండలంలోని జమ్మనపల్లి, పుచ్చకాయలపల్లి, సుంకేసుల గ్రామాల మధ్య రహదారి అధ్వానంగా ఉంది. ఈ రహదారిలో మార్కాపురం నుంచి పుచ్చకాయలపల్లి, సుంకేసుల, కలనూతల, గుండంచర్ల గ్రామాలకు నిత్యం ఆటోలు, ద్విచక్ర వాహనాలు, ఆర్టీసీ బస్సులు తిరుగుతూనే ఉంటాయి. ఈ నెల 29వ తేదీన శ్రీ కాటమరాజు స్వామి తిరునాళ్ల నిర్వహించనున్నారు. తిరునాళ్ల రోజు లారీలు, ప్రత్యేక ఆర్టీసీ బస్సులు, ఆటోలు, ట్రాలీ ఆటోలు, తదితర వాహనాలు తిరుగుతాయి. గుంతలు ఎక్కువగా ఉండటంతో ప్రయణం చేయాలంటే కష్టంగా ఉందని వాహనదారులు చెబుతున్నారు. సంబంధిత అధికారులు తారు రోడ్డుపై గుంతలు పడిన చోట తాత్కాలికంగా గుంతలు పూడ్చి మరమ్మతులు చేయాలనే ఆలోచన చేయడం లేదు. ఆయా గ్రామాల ప్రజలు రాకపోకలకు ఇబ్బందిగా ఉందని, గుంతలు పూడ్చాలని అధికారులకు చెప్పినా పట్టించుకున్నా పాపాన పోలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాహనాల రాకపోకలతో రోడ్డుపై కంకర లేచి గుంతలుగా మారాయి. పుచ్చకాయలపల్లి నుంచి సుంకేసుల గ్రామానికి మధ్యలో కొండపై రోడ్డు మార్జిన్లు లోతుగా ఉండటంతో ఎదురెదురుగా వచ్చే వాహనాలు పక్కకు దిగాలంటే చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాహనదారులు వాపోతున్నారు. రాత్రి సమయంలో రహదారి గురించి తెలియని దూర ప్రాంతాల ప్రజలు వేగంగా వాహనాలతో వస్తే గుంతల్లో పడి ప్రమాదాల బారిన పడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. రహదారులు శిథిలావస్థకు చేరుకొని ఆధ్వానంగా మారడంతో ప్రయాణం చేయాలంటే నరకాన్ని తలపిస్తోంది. గుంతలు పడిన చోట తాత్కాలికంగా మట్టి, కంకర వేసి మరమ్మతులు చేయాలనే విషయాన్ని అధికారులు మరచిపోయారు. అధికారులు మూలమలుపుల వద్ద ఎలాంటి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయలేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మూలమలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి గుంతలు పూడ్చి ప్రయాణం సాఫీగా సాగేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



పుచ్చకాయలపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో రోడ్డుపై గుంతలు

క్రికెట్ బెట్టింగులు నిర్వహిస్తే చర్యలు



మాట్లాడుతున్న ఎస్‌ఐ అనిల్‌కుమార్

పెద్దారవీడు: యువత క్రికెట్ బెట్టింగులు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ పి. అనిల్‌కుమార్ హెచ్చరించారు. స్థానిక పోలీసుస్టేషన్‌లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రజలు బెట్టింగ్ యాప్‌లతో భవిష్యత్‌ను పాడు చేసుకోవద్దని సూచించారు. ఇటీవల కాలంలో ఆన్‌లైన్ జూదానికి అలవాటుపడి, క్రికెట్ బెట్టింగుల యాప్‌లను ఉపయోగించి లక్షల రూపాయలు పోగొట్టుకున్నారని తెలిపారు. ఇంట్లో తల్లిదండ్రులకు తెలియకుండానే యువత క్రెడిట్ కార్డులు, ఆన్‌లైన్ చీటీల ద్వారా అప్పులు చేసి వాటిని తీర్చలేక ఆత్మహత్యలకు చేసుకుంటున్నారని చెప్పారు. యువత మత్తు పదార్థాలకు బానిసై బతుకులను నాశనం చేసుకోరాదని, పిల్లలపై శ్రద్ధ వహించి చెడు అలవాటుల బారిన పడకుండా చూసుకోవాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. మండల పరిధిలో క్రికెట్ బెట్టింగ్‌లపై పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారన్నారు. చెడు సాహవాసాలతో పాటు సరదాగా చేసుకునే దురలవాట్ల కారణంగా జీవితాలు అంధకారం అవుతుందన్నారు. గ్రామాల్లో ఎక్కడైనా గుంపులు గుంపులుగా కూర్చొని ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగులు సెల్ చూస్తూ నిర్వహించినా చట్టపరమైన చర్యలు తప్పవని పేర్కొన్నారు. ఆన్‌లైన్ జూదాలు, క్రికెట్ బెట్టింగులతో అనేక కుటుంబాలు రోడ్డున పడటమే కాకుండా డబ్బులు పోగొట్టుకొని అప్పులపాలై, అప్పులు తీర్చలేక దిక్కుతోచని పరిస్థితిలో ఆత్యహత్యలకు పాల్పడిన సంఘటనలు ఎన్నో ఉన్నాయన్నారు. ఈ పరిసర ప్రాంతాల్లో క్రికెట్ బెట్టింగులు జరుగుతున్నట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ఎస్‌ఐ అనిల్‌కుమార్ భరోసా ఇచ్చారు.

వేసవిలో జాగ్రత్తలు తీసుకోవాలి



డాక్టర్ లక్ష్మీనరసింహ

పుల్లలచెరువు: ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో ప్రజలు పలు జాగ్రత్తలు తీసుకోవాలని మెడికల్ ఆఫీసర్ లక్ష్మీనరసింహ సూచించారు. ఆయన వైద్యశాలలో మంగళవారం మాట్లాడుతూ వేసవి కాలంలో వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఎండలో ఎక్కువగా తిరగకూడదని, బయటకు వెళ్లాల్సి వస్తే గొడుగు, టోపీ వంటివి వాడాలని, ముఖంపై కర్చీఫ్ లాంటివి కట్టుకోవాలన్నారు. తగినన్ని నీళ్లు తాగాలని, వదులుగా ఉండే దుస్తులు ధరించాలన్నారు. శరీరం వేడెక్కినట్లు, తల తిరిగినట్లు ఉండి శరీర ఉష్ణోగ్రత పెరిగితే ఓఆర్ఎస్, ఇతర ద్రవ పదార్థాలు తాగాలని సూచించారు. అధిక వేడి, తలనొప్పి, వికారం, వాంతులు వంటి లక్షణాలు కనిపిస్తే వడదెబ్బ సంకేతాలుగా భావించాలన్నారు. పిల్లలు, గర్భిణులు, వృద్ధులు మరింత జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అవసరమైతే తప్ప బయటకు రాకూడదన్నారు. వడదెబ్బ లక్షణాలు కనిపిస్తే సమీపంలో ఆశ కార్యకర్త, ఏఎన్ఎంను సంప్రదించి చికిత్స చేయించుకోవాలన్నారు. వైద్యశాలలో ఓఆర్ఎస్ ప్యాకెట్‌లు అందుబాటులో ఉన్నాయని వివరించారు.

పద్ధతి మార్చుకుని సన్మార్గంలో నడవాలి



రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ ఇస్తున్న ఎస్‌ఐ సంపత్‌కుమార్

పుల్లలచెరువు: వివిధ గ్రామాల్లో ఉన్న రౌడీషీటర్లు పద్ధతులు మార్చుకుని సన్మార్గంలో నడవాలని ఎస్‌ఐ సంతపకుమార్ సూచించారు. మంగళవారం స్థానిక పోలీసుస్టేషన్‌లో రౌడీషీటర్స్‌కు ఆయన కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ వారిని ఉద్దేశించి మాట్లాడుతూ రౌడీషీటర్స్ కదలికలను ఎప్పటికప్పుడు గమనిస్తున్నామని, గతంలో చేసిన, చేస్తున్న పనులకు స్వస్తి చెప్పి పద్ధతి మార్చుకుని జనజీవన స్రవంతిలో జీవించాలన్నారు. గ్రామాల్లో గొడవలు చేస్తాం..రౌడీ పనులు చేస్తాం..అంటే కుదరదని హెచ్చరించారు. హద్దు మీరితే గ్రామ, మండల, జిల్లా బహిష్కరణ చేస్తామని స్పష్టం చేశారు.

డీకే పట్టాదారులూ విశిష్ట సంఖ్యకు అర్హులే



రైతులతో మాట్లాడుతున్న ఏవో నిర్మలాదేవి

పుల్లలచెరువు: గ్రామాల్లో అసైన్‌మెంట్, డీకే పట్టా భూములు ఉన్న రైతులు కూడా రైతు విశిష్ట సంఖ్య నమోదు చేయించుకునేందుకు అర్హులని మండల వ్యవసాయాధికారి నిర్మలాదేవి తెలిపారు. మంగళవారం మండలంలోని కొమరోలు, మల్లా పాలెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించి అనంతరం రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి ఏవో మాట్లాడుతూ అసైన్‌మెంట్ భూమి, డీకే పట్టా భూమి కలిగిన రైతులు ప్రభుత్వం సూచించిన రైతు విశిష్ట సంఖ్య నమోదు చేయించుకోవచ్చని, సమీపంలోని రైతు సేవా కేంద్రానికి వెళ్లి నమోదు చేయించుకోవాలన్నారు. కందుల కొనుగోలు కేంద్రాన్ని స్థానిక పీఏసీఎస్‌లో ఏర్పాటు చేశారని, కంది రైతులు యాప్‌లో పేర్లు నమోదు చేసుకుని కందులను పీఏసీఎస్‌లో విక్రయించుకోవాలని కోరారు. రైతులతో పాటు వీఏఏలు కిరణ్, ప్రశాంత్‌నాయక్ పాల్గొన్నారు.

పంచాయతీ నిధుల దుర్వినియోగంపై విచారణ



రికార్డులు పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ హనుమంతురావు

దొనకొండ: మండల కేంద్రం దొనకొండ పంచాయతీ నిధులు దుర్వినియోగం చేస్తున్నారని గ్రామానికి చెందిన ఓ వ్యక్తి పంచాయతీ కమిషనర్‌కు, కలెక్టర్ తమీమ్ అన్సారియాకు ఫిర్యాదు చేశారు. కమిషనర్, కలెక్టర్ ఆదేశాల మేరకు కందుకూరు డీఎల్‌పీఓ ఎస్‌వీఎల్ హనుమంతురావు మంగళవారం పంచాయతీ కార్యాలయంలో విచారణ చేపట్టారు. విచారణ సమయంలో ఫిర్యాదుదారుడు రాకపోవటంతో డీఎల్‌పీఓ రికార్డులు పరిశీలించి కార్యదర్శి పి.క్రిష్ణమూర్తికి సూచనలు, సలహాలందించారు. రికార్డులను కందుకూరు తీసుకెళ్లి క్షుణ్ణంగా పరిశీలించి నివేదికను కమిషనర్, కలెక్టర్‌కు అందజేస్తామని డీఎల్‌పీఓ తెలిపారు. ఈ సందర్భంగా అయన విలేకరులతో మాట్లాడుతూ నిధులు దుర్వినియోగమైనట్లు రుజువైతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వివరించారు.

సీపీఎస్ ఉద్యోగులకు డీఏ చెల్లించాలి



మాట్లాడుతున్న యూటీఎఫ్ నాయకులు

దర్శి: సీపీఎస్ ఉద్యోగులకు డీఏ, అరియర్‌లు చెల్లించాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి మీనిగ శ్రీను, మండల అధ్యక్ష, కార్యదర్శులు కె.శ్రీనివాసరావు, పి.ఖాశీం కోరారు. దర్శి పట్టణంలో వారు సమావేశం నిర్వహించి మాట్లాడుతూ ప్రభుత్వం పీఎఫ్, ఏపీజీఎల్ఐల రూపంలో ఉపాధ్యాయులు దాచుకున్న నగదు విడుదల చేసిందన్నారు. 2023 నుంచి రావాల్సిన డీఏలు, సరండర్ లీవ్‌లు కూడా మంజూరు చేయాలని కోరారు. 12వ పీఆర్సీ కమిషన్ వేసి ఈ లోపు మధ్యంతర భృతిని 30 శాతం ప్రకటించాలన్నారు. ఉద్యోగులు కూడా ప్రభుత్వంలో ఒక భాగమని గుర్తించాలన్నారు. ఆప్‌ల భారం తగ్గించి బోధనకే సమయం కేటాయించాలని కోరారు. బేసిక్ ప్రైమరీ స్కూల్ ఉంచుతూ మోడల్ ప్రైమరీ స్కూల్స్ ఏర్పాటు చేయాలని, యూపీ స్కూల్స్ కొనసాగించాలని డిమాండ్ చేశారు. సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను కొనసాగించాలని డిమాండ్ చేశారు. సహాధ్యక్షుడు అట్లూరి రామారావు, జిల్లా కౌన్సిల్ సభ్యులు తుమ్మల చెంచయ్య పాల్గొన్నారు.

కొమరోలు పంచాయతీలో అభివృద్ధి శూన్యం

కొమరోలు: గ్రామ పంచాయతీ వ్యవస్థ దారుణంగా ఉంది. పట్టణంలో అభివృద్ధి శూన్యమని స్థానిక ఎంపీటీసీ షేక్ మౌలాలి, షేక్ సుభాని ఈవోఆర్‌డీపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కొమరోలులోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ కామూరి అమూల్య అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మండల స్థాయి అధికారులతో శాఖల వారీగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కొమరోలు 1, 2 ఎంపీటీసీలు షేక్ మౌలాలి, షేక్ సుభాని మాట్లాడుతూ చిన్నపాటి వర్షం పడినా రహదారులపై వర్షం నీరు నిలబడి అధ్వానంగా తయారవుతున్నాయని, పలు ప్రాంతాల్లో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని తెలిపారు. ఎన్నో పర్యాయాలు సమస్యలపై ప్రశ్నించినా అధికారుల చుట్టూ తిరిగినా సమస్యలు పరిష్కారం కావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానికంగా సర్పంచ్ అందుబాటులో ఉండకపోవడంతో కొమరోలు గ్రామ పంచాయతీ అభివృద్ధి కుంటుపడిందని తెలిపారు. బాదినేనిపల్లె గ్రామంలో విద్యుత్ తీగలు కిందికి వేలాడుతున్నాయని ఎంపీటీసీ శ్రీనివాసులరెడ్డి, విద్యుత్‌శాఖ ఏఈ శ్రీనివాసులును ప్రశ్నించారు.

ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలి

మార్కాపురం టౌన్: పశ్చిమ ప్రకాశంలో ఈ నెల 27న జరగనున్న మండల పరిషత్ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని రిటర్నింగ్ అధికారులకు జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి చిరంజీవి సూచించారు. మంగళవారం మార్కాపురం ఎంపీడీవో కార్యాలయంలో మార్కాపురం, పుల్లలచెరువు, త్రిపురాంతకం, ఎర్రగొండపాలేనికి చెందిన రిటర్నింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 27న ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు, కలెక్టర్ సూచనల మేరకు ఎన్నికలు నిర్వహించాలన్నారు. మార్కాపురం ఎంపీపీ, త్రిపురాంతకం ఎంపీపీ, ఎర్రగొండపాలెం మండల సభ్యుని, పుల్లలచెరువు మండల ఉపాధ్యక్షుడు పోస్టుకు ఎన్నికలు జరగనున్నాయన్నారు. ఎన్నికల విధులను కమిషన్ ఆదేశాలను రిటర్నింగ్ అధికారులకు వివరించారు. డీఎల్‌డీవో శ్రీనివాసరెడ్డి, మండలాల రిటర్నింగ్ అధికారులు వండర్‌మ్యాన్, విష్ణువర్ధన్‌రెడ్డి, ఉపేంద్రకుమార్, శ్రీనివాస్, పాల్గొన్నారు.

కస్తూరిబాలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

కొనకనమిట్ల: మండలంలోని గొట్లగట్టు కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ రాఘవ సురేఖ తెలిపారు. 2025-26 సంవత్సరానికి 6వ తరగతి, ఇంటర్ ఫస్ట్ ఇయర్ (ఎంపీసీ)లో ప్రవేశాలకు అర్హులైన విద్యార్థినులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ కోరారు. ఆరో తరగతిలో 40, ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో 40 మందికి సీట్లు ఉన్నాయన్నారు. మిగతా తరగతులకు సంబంధించి ఖాళీల ఆధారంగా దరఖాస్తులుకు అనుమతి ఇస్తామన్నారు. వివరాలకు 85007 23716, 8897710857 నంబర్లను సంప్రదించాలని సురేఖ సూచించారు.

తిరుపతిరెడ్డికి ఎమ్మెల్యే బూచేపల్లి నివాళి



తిరుపతిరెడ్డికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి

దర్శి: వైఎస్సార్ సీపీ నాయకుడు, మార్కెట్ యార్డ్ మాజీ డైరెక్టర్ గంజి వెంకటేశ్వరరెడ్డి తండ్రి తిరుపతిరెడ్డి సోమవారం మృతి చెందారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ఆయన మృతదేహానికి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఆయన మృతికి కారణాలు అడిగి తెలుసుకున్నారు. తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డితో పాటు కౌన్సిలర్ మేడం మోహన్‌రెడ్డి, సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు కేసరి రాంభూపాల్ రెడ్డి, గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ మాజీ డైరెక్టర్ కుమ్మిత అంజిరెడ్డి, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు ఇరుగుల శ్రీనివాసరెడ్డి, ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు బొమ్మిరెడ్డి లక్ష్మీరెడ్డి ఉన్నారు.

నీటి సమస్యను పరిష్కరించాలి



ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను నిలదీస్తున్న ఎంపీటీసీ అమ్మాజీ

దొనకొండ: వేసవిలో గ్రామాల్లో నీటి సమస్య ఉంటుందని, అధికారులు సమస్యను పరిష్కరించాలని ఎంపీపీ బొరిగొర్ల ఉషా అన్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఆమె అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఏప్రిల్, మే, జూన్, జూలై నెలల్లో వేసవితో గ్రామాల్లో నీటి సమస్య ఉంటుందని, అధికారులు గ్రామాలకు వెళ్లి నీటి సమస్య ఎక్కడ ఉంటే అక్కడ పత్యామ్నాయ మార్గం ఆలోచించి నీరు సరఫరా చేయాలన్నారు. కొచ్చెర్లకోట పంచాయతీలో రెండు నెలల నుంచి సాగర్ నీరు సరఫరా కావటం లేదని, ప్రజలు తాగు నీటికి ఇబ్బంది ఎదుర్కొంటున్నారని, ప్రత్యామ్నాయ మార్గంగా ట్యాంకులతో నీరు సరఫరా చేయలేదని, అధికారుల దృష్టికి ఎన్నోసార్లు తెచ్చినా పరిష్కరించలేదని వైస్ ఎంపీపీ మిట్టా కోటిరెడ్డి, కొచ్చెర్లకోట-2 ఎంపీటీసీ ఆంథోనిబాబు సమావేశంలో మండిపడ్డారు. అధికారులు సాకులు చెప్పి తప్పించుకుంటున్నారన్నారు. దొనకొండలోని బేతేలుపురంలో 2 నెలల నుంచి డీప్ బోర్లు ద్వారా నీరు సరఫరా కావటం లేదని, ఒక డీప్ బోర్ మరమ్మతులకు గురైందని దొనకొండ ఎంపీటీసీ గుంటు అమ్మాజీ సభ దృష్టికి తెచ్చారు. సర్పంచ్‌కు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోలేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. యర్రబాలెం గ్రామానికి నీరు సరఫరా కావడం లేదని, పైపులైన్ మరమ్మతుల కారణంగా తాగు నీటికి ఇబ్బంది ఎదుర్కొంటున్నామని దొనకొండ ఎంపీటీసీ-2 తాల్లూరి లక్ష్మి పేర్కొన్నారు. ఇండ్లచెరువు పంచాయతీ పరిధి గుట్టమీదపల్లెలో చేతి పంపుల నీటిలో ఫ్లోరైడ్ ఉండటంతో అనారోగ్యాలకు గురవుతున్నారని, సాగర్ పైపులైన్ తమ గ్రామానికి వేశారని, నీటి సరఫరా మరిచారని ఎంపీటీసీ పాతకోట కోటమ్మ సభలో మండిపడ్డారు. స్పందించిన ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు 2 రోజుల్లో అన్ని గ్రామాలు పర్యటించి నీటి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు మురికిపూడి సుధాకర్, వైస్ ఎంపీపీలు వడ్లమూడి వెంకటేశ్వర్లు, మిట్టా కోటిరెడ్డి, ఈఓఆర్‌డీ ఆదాం షఫీ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

కొత్త పథకాలు నేతల దృష్టికి తేవాలి



సభలో మాట్లాడుతున్న ఎంపీపీ తాటికొండ

తాళ్లూరు: కొత్తగా అమలవుతున్న నూతన పథకాల విషయం ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకురావాలని ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆయన అధ్యక్షతన మంగళవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ అధికారులు తహసీల్దార్ కార్యాలయం వద్దే కాలక్షేపం చేస్తున్నారని, ప్రజల అవసరాలు తీర్చేందుకు దృష్టి సారించాలన్నారు. ఇన్‌చార్జి ఎంపీడీవో హనుమంతురావు మాట్లాడుతూ ఎండాకాలం నేపథ్యంలో ప్రజలకు సాగు, తాగునీటి సమస్యలు తలెత్తకుండా చూస్తామన్నారు. కొన్ని పథకాలు ప్రజలకు చేరవేయడంలో అధికారులు విఫలమవుతున్నారని జెడ్పీటీసీ సభ్యుడు మారం వెంకారెడ్డి అన్నారు. మండలంలో రెవెన్యూ సమస్యలు అధికంగా ఉన్నాయని, అధికారులు సరిగా స్పందించట్లేదని, పార్టీలకు అతీతంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు తక్షణమే పరిష్కరించాలని వైస్ ఎంపీపీ ఇడమకంటి వెంకటేశ్వరరెడ్డి కోరారు. రెవెన్యూ సమస్యలు పరిష్కరించేందుకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని తహసీల్దార్ సంజీరరావు అన్నారు. పదో తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు పరీక్ష కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించామని ఎంఈఓ-1 సుబ్బయ్య, ఎంఈఓ-2 సుధాకర్ స్పష్టం చేశారు. జిల్లా సర్పంచుల సంఘ ఉపాధ్యక్షుడు మారం ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ ఉపాధి పనులు గత ప్రభుత్వంలో సర్పంచ్‌ల దృష్టికి తీసుకొచ్చేవారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఫీల్డ్ అసిసెంట్లు మస్టర్ల విషయంలో వారి సొంత నిర్ణయాలతో మెలుగుతున్నారని మండిపడ్డారు. సమావేశంలో పలు శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

పిల్లలపై వేధింపులు క్షమించరాని నేరం



ప్రధానోపాధ్యాయులకు సూచనలిస్తున్న ఎస్సై నరసింహారావు

కంభం: పిల్లలపై వేధింపులు క్షమించరాని నేరమని స్థానిక ఎస్సై నరసింహారావు పేర్కొన్నారు. స్థానిక ఎంఈఓ కార్యాలయంలో మండలంలోని ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఎస్సై మాట్లాడుతూ బాల్య వివాహాలు, పోక్సో చట్టాలపై ప్రధానోపాధ్యాయులకు అవగాహన కల్పించారు. పోక్సో చట్టం ప్రకారం లైంగిక వేధింపులకు పాల్పడితే కఠిన శిక్షలు ఉంటాయని, ఉద్యోగాన్ని సైతం కోల్పోవాల్సి వస్తుందన్నారు. 18 ఏళ్ల వయస్సులోపు పిల్లలపై వేధింపులకు పాల్పడకుండా ఈ చట్టం ఉపయోగపడుతుందని సెక్షన్ల వారీగా చట్టాల తీవ్రతను వివరించారు. నేరం చేయడం, నేరస్తులకు సహకరించడం శిక్షార్హమేనన్నారు. పాఠశాల స్థాయిలో శిక్షల పట్ల అప్రమత్తత అవసరమని, విద్యార్థుల్లో గుడ్ టచ్, బ్యాడ్ టచ్ అవగాహన కలిగి ఉండాలన్నారు. క్షణికానందం కోసం తప్పులు చేస్తే శిక్షలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంఈఓ లు మాల్యాద్రి, శ్రీనివాసులు, పాల్గొన్నారు.

ఆటపాటలతో అంగన్‌వాడీ విద్య

తర్లుపాడు: ఆటపాటలతో అంగన్‌వాడీ విద్యను చిన్నారులకు అందించాలని సీడీపీఓ బి.సుశీలాదేవి తెలిపారు. మార్కాపురం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలకు కలుజువ్వలపాడులోని జెడ్పీ హైస్కూల్లో మంగళవారం శిక్షణను ఆమె ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థుల మానసిక, శారీరక స్థితిగతులను గమనిస్తూ మేధాశక్తి అభివృద్ధి చేయాలన్నారు. చిన్నారుల్లో పౌష్టికాహార లోపాన్ని గుర్తించి పౌష్టికాహారాన్ని అందించాలన్నారు. మానసిక ఒత్తిడిని తగ్గించే విధంగా బోధన చేయాలన్నారు.